క్లుప్తంగా

12 నుంచి విశేష యజ్ఞాలు

కడప కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో దేవదాయ ధర్మదాయశాఖ ఈనెల 12 నుంచి 17వ తేది వరకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో పలు యజ్ఞాలను నిర్వహించనుందని వైఎస్సార్ జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ తెలిపారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణ, ఆంధ్రరాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, రాష్ట్ర ప్రజల శాంతి సౌభాగ్యాలు, పాడి పంటల వృద్ధి, ప్రకృతి మాత అనుగ్రహం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజు మండప పూజలు, కలశారాధనలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. ప్రసిద్ధ దేవాలయాల స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆకట్టుకున్న క్రాఫ్ట్ ప్రదర్శన

వైవీయూ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్, రెవిన్యూ కాయిన్స్, కరెన్సీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను మానవత స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. క్రాఫ్ట్, ఫుడ్ ఐటమ్స్ అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును వృద్ధాశ్రమాలకు ఇవ్వనున్నట్లు కళాశాల చైర్మన్ బి. రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 40 మంది ఉద్యోగాలకు ఎంపిక

వైవీయూ: కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో లోకేష్ ఇన్ఫోటెక్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో కాంసెన్‌ట్రిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌ను కళాశాల డైరెక్టర్, వైవీయూ పాలకమండలి సభ్యుడు జి. సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్ ఎంపికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఎంపికలకు దాదాపు 150 మంది అభ్యర్థులు హాజరుకాగా.. ప్రతిభ కనబరిచిన 40 మందిని ఉద్యోగాలకు ఎంపికచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

రక్తదాన వారోత్సవాల్లో 123 మంది రక్తదానం

వైవీయూ : రక్తదాన వారోత్సవాల్లో భాగంగా బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో 7 రోజుల్లో 123 మంది రక్తదానం ఇవ్వడం సంతోషంగా ఉందని సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్ కుమార్ పేర్కొన్నారు. రక్తదాన వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం కడప నగరంలోని అప్సర సర్కిల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రక్తనిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. చివరిరోజు గురువారం 23 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు అధికారి డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది జయచంద్రారెడ్డి, హరి, భాస్కర్, పద్మ, పుల్లయ్య, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ చిన్నమస్తాదేవి జయంతి

కడప కల్చరల్ : కడప నగరం చలమారెడ్డిపల్లెలోని దశమహావిద్య శ్రీ భువనేశ్వరీదేవి మందిరంలో గురువారం చిన్నమస్తాదేవి జయంతి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేసిన కనుల పండువగా అలంకరించి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర నిర్వాహకులు మహోదర నాగేంద్రప్రసాద్ స్వామి అమ్మవారి ఆవిర్భావాన్ని గురించి, ఆరాధిస్తే ఒనగూరే ఫలితాల గురించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ చైర్మన్ దండు లక్ష్మీకళ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

డీఈఓకు వినతి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం జిల్లా విద్యాశాఖాధికారి రాఘవ రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిందన్నారు. జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యాశాఖ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ ఆదేశాలు పాటించని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సునీల్ కుమార్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ



పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

కడప కల్చరల్ : స్థానిక పోతుల కంచమ్మ, చిన్న ఓబుల్‌రెడ్డి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో కడప నగరంలోని రామకృష్ణ వృద్ధుల ఆశ్రమంలో వస్త్రాలు, దుప్పట్లు అందజేశారు. సంస్థ నిర్వాహకులు పోతుల వెంకట్రామిరెడ్డి తన తండ్రి చిన్న ఓబుల్‌రెడ్డి స్మారకంగా శివరామిరెడ్డి, వైఎస్ ఉమాదేవి, ధనుష్‌రెడ్డి, కుశల్‌రెడ్డి తదితరులు ఆశ్రమ వాసులకు చీరలు, పంచెలు, దుప్పట్లు అందజేశారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ రెడ్డి

వల్లూరు : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలను వైఎస్సార్ సీపీ పొందుతోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆదినిమ్మాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదినిమ్మాయపల్లె, మిట్టపల్లె, పుష్పగిరి, కొత్తగాలివారిపల్లె తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించి అనంతరం వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. మిట్టపల్లెలో పెన్నా నదిలోకి వెళ్ళడానికి దారిని ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పెన్నా నదిలోకి వెళ్లడానికి సైడ్ వాల్స్‌తోపాటు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.9 లక్షల నిధులు మంజూరు చేయించామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, నాగ సుబ్బారెడ్డి, హనుమంతురెడ్డి, నాగిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మస్తాన్, అంకిరెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, దానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, పలుశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదినిమ్మాయపల్లెలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమాండ్ కంట్రోల్‌పై నిత్య పర్యవేక్షణ ఉండాలి

● డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్: కడప నగరంలో సీసీ కెమెరాల నిఘా, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ వ్యవస్థను గురువారం కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తనిఖీ చేశారు. నగర పరిధిలో సీసీ కెమెరాల పనితీరుపై ప్రశ్నించారు. సీసీ కెమెరాల నిఘా ఎంతో అవసరమని, ఎళ్ల వేళలా పర్యవేక్షిస్తూ ఉండాలనీ సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలలో ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి నాగరాజు, కడప టూటౌన్ అప్‌గ్రేడ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ హాసం, ఒన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ వ్యవస్థను తనిఖీ చేస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, పోలీసు అధికారులు

17న సామాజిక తనిఖీ బహిరంగ సభ

దువ్వూరు : మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 17న సామాజిక బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. 2022- 23 ఏడాదికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై ఆయా గ్రామాల్లో తనిఖీ బృందాలు ఈనెల 15వ తేదీ వరకు తనిఖీ నిర్వహిస్తారని, అనంతరం 17న ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై బహిరంగ సభ నిర్వహిస్తారని వివరించారు. ఈ సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పది

కడప కార్పొరేషన్: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని 22వ డివిజన్ ఇన్‌చార్జి రామచంద్రయ్య అన్నారు. గురువారం మాజీ కార్పొరేటర్ బోలా పద్మావతి రెండో వర్థంతి సందర్భంగా బోలా జయరాం, బోలా చక్రధర్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ కౌన్సిలర్‌గా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, కార్పొరేటర్‌గా బోలా పద్మావతి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.

ఘనంగా లక్ష్మీనరసింహుని కల్యాణోత్సవం

వల్లూరు : మండల పరిధిలోని డి.కొత్తపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వామి వారి కల్యాణమహోత్సవం ఘనంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాన్ని నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం దిగువపల్లె, డి.కొత్తపల్లె, పెండ్లిమర్రి మండలంలోని ఎగువపల్లె గ్రామాలలో స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువకుల విన్యాసాల మధ్య గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వై. రాఘవరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని స్విస్ట్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కోర్సులకు మంచి ఆదరణ ఉందని వాటికి అనుగుణంగా మంచి కోర్సును ఎంచుకొని ఉద్యోగ, ఉపాధిని సాధించాలన్నారు. కళాశాల చైర్మెన్ రాజోలి సాయిశరణ్‌రెడ్డి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ చంద్ర ఓబుల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జీవి సురేష్‌బాబు, కొరియో గ్రాఫర్ పి. అమిత్ మాస్టర్ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాఘవరెడ్డి

'కబ్జాదారుల నుంచి భూమిని కాపాడండి'

కడప కార్పొరేషన్: కబ్జాదారుల నుంచి తమ భూమిని కాపాడాలని కడప నగరం ఉక్కాయపల్లెకు చెందిన శీర్ల సుదర్శన్ తెలిపారు. తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉక్కాయపల్లె గ్రామం పొలంలోని ఖాతానంబర్ 679లో సర్వేనంబర్ 623,648/2, 648/ఏ2లో 0.63 సెంట్లు గల విస్తీర్ణం గల భూమిలో తాము పంటలు వేసుకొని జీవించేవారమన్నారు. ప్రస్తుతం ఆ భూమిని ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఆన్‌లైన్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు ఆ భూమిని వారిపై ఆన్‌లైన్ చేయకుండా తమకు వారి దౌర్జన్యాల నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి

మైదుకూరు : పట్టు పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామని ఉద్యాన శాఖ ప్రభుత్వ సలహాదారుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి తెలిపారు. గురువారం వనిపెంట వద్ద ఉన్న పట్టు పరిశ్రమను జిల్లా సెరికల్చర్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. పరిశ్రమలో పెంచుతున్న మల్బరీ నర్సరీని చాకి పద్ధతులను ఆయన పరిశీలించారు. పరిశ్రమ స్థితిగతులను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. దసలి పట్టు పెంపకాన్ని చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో రైతు ప్రయోజనాలకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఇందుకు తన సహకారం అందిస్తానని చెప్పా రు. ఆయన వెంట జిల్లా పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎ.రామశివదీక్షిత్, సాంకేతిక అధికారి పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి

● డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి

కమలాపురం : మండలంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్లలో జరుగుతున్న అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను, పెద్దచెప్పలి, కొండాయపల్లెలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. దినసరి ఎంత మేరకు కూలీ డబ్బు పడుతోందని ఆరా తీశారు. అనంతరం ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మండలంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ముఖ్యంగా జాబ్ కార్డులేని వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. అడిగిన వారందరికీ పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అలాగే రూ.272 కూలీ డబ్బులు పడే విధంగా కొలతలు ఇచ్చి పనులు చేయించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, అంబడ్స్‌మెన్ ఆఫీసర్ సాంబశివారెడ్డి, ఏపీఓ శైలజ, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

గ్రామ వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : మండల పరిధిలోని లేబాక గ్రామ పంచాయతీలో ఖాళీగా వున్న గ్రామ వలంటీర్ పోస్టుకు అర్హత, ఆసక్తి వున్న అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లేబాక పంచాయతీలో ఓసీ (పురుషులు)- 1 ఖాళీగా వుందని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి 10 తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం వుందని ఆమె తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 8న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు .

నేడు సుంకేసుల వీరాంజనేయుడి తిరునాల

ఖాజీపేట : సుంకేసుల గ్రామంలో వెలసిన వీరాంజనేయుడి తిరునాల ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా స్వామికి పేరు. ఈ ఏడాది తిరునాలను 5న(మొలకల పౌర్ణమి) నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. తిరునాల సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. అలానే రెండెద్దుల పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నారు. అలాగే ట్రాక్టర్ ట్యాలీతో రివర్స్ పోటీలు చిన్నపిల్లలకు ఆటల పోటీల నిర్వహిస్తున్నారు. ప్రతి యేడు జరిగే తిరునాలలో ప్రజలు వేల సంఖ్యలో పాల్గొంటారు. భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ ఏర్పాట్లను పూర్తి చేసింది. తిరునాల రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు.



కె.సుంకేసులలోని వీరాంజనేయుడి స్వామి గుడి

వేధింపుల కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌లో నివాసం వుంటున్న మహమ్మద్ ఆలీ, సయ్యద్ భానుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు వున్నారు. భర్త, భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ ఉలసయ్య తెలిపారు.

6, 7న గంగమ్మ తిరునాల

మైదుకూరు : మండలంలోని శివపురం వద్ద వెలసిన గంగమ్మకు ఈనెల 6, 7 తేదీల్లో తిరునాలను జరుపనున్నట్లు సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో 6వ తేదీ ప్రత్యేక పూజలు, 7వ తేదీ సేద్యపు ఎద్దులతో బండలాగుడు పోటీలు, మనుషులకు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 6న రాత్రి పౌరాణిక నాటకాల ప్రదర్శన, 7న మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం ఉంటాయని వివరించారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తే క్షమించం


పోరుమామిళ్ల : ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే క్షమించేది లేదని రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు పి.నాగార్జునరెడ్డి హెచ్చరించారు. మండల రెవెన్యూ సిబ్బంది అవినీతిపై ఇటీవల ఆరోపణలు పత్రికల్లో, సోషల్ మీడియాలో రావడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం పుల్లివీడు, సిద్దవరం, చల్లగిరిగెల సచివాలయాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో ప్రజలు గ్రీవెన్‌సెల్‌కు ఉద్యోగులు అందరూ హాజరు కావడంలేదని ముఖ్యంగా వీఆర్వోలు, సర్వేయర్లు సచివాలయాలకు రావడం లేదని తెలిపారు. పుల్లివీడుకు వీఆర్‌ఓ వెంకటేశ్వర్లును రెండు నెలల క్రితం డిప్యుటేషన్‌పై వేశారని ఆయన ఎప్పుడూ సచివాలయానికి రాడని ప్రజలు ఆరోపించారు. వీఆర్‌ఓ ఆనంద్ కూడా సచివాలయానికి రావడం లేదన్నారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నదన్నారు. పోరుమామిళ్ల తహసీల్దారుపై ఇటీవల అవినీతి ఆరోపణలు అధికమవడం బాధాకరమన్నారు. తహసీల్దారుపై సమగ్ర విచారణ జరపాలని, ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేస్తానని నాగార్జునరెడ్డి తెలిపారు.



పుల్లివీడు సచివాలయాన్ని సందర్శించిన నాగార్జునరెడ్డి

శాస్త్ర విజ్ఞానంతో ఉత్తమ సమాజం

కడప కల్చరల్ : నేటితరం విద్యార్థులు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే ఉత్తమ పౌరులై మంచి సమాజాన్ని నిర్మించగలరని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం కడప నగరం రవీంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన శాస్త్ర విజ్ఞానం- విద్యా వ్యవస్థ- విద్యార్థులకు అవగాహన అంశంపై సోదాహరణంగా ప్రసంగించారు. సంస్థ ప్రతినిధి జగదీష్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జేవీవీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, చెకుముకి కన్వీనర్ కిరణ్, యువజన విభాగం ప్రతినిధి మధు, సమత నాయకులు కామేశ్వరమ్మ నృత్యాలు, పాటలు, ఆసక్తికరమైన సైన్స్ ప్రయోగాలు చేసి అలరించారు. పలువురు డ్యాన్స్ మాస్టర్లు నృత్యాలు నేర్పించారు.



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్

హనుమంతుడి వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : వెల్లాల గ్రామంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి హనుమంతుడి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాములను వైభవంగా ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో స్వాములను ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా భక్తులు స్వాములను దర్శించుకుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కానాల విజయల బలరామి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గజ వాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా గంగారాజ రాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామికి విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ తెలిపారు.

సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

వీరపునాయునిపల్లె : మండల సమావేశానికి హాజరయ్యే అధికారులు సమయపాలన పాటించాలని లేకపోతే కఠిన చర్యలు తప్పవని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలన్నారు. మూడు నెలలకొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరు కావడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం మంచి పద్ధతికాదని ఆయన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారన్న నమ్మకంతో మనందరిని ఎన్నుకోవడం జరిగిందని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులు చేయాలని ప్రజా ప్రతినిధులకు ఆయన సూచించారు. ఆర్టికల్చర్ అధికారి రెడ్డెయ్య మాట్లాడుతూ చీనీ, నిమ్మ పంట సాగులో నీటి యాజమాన్య పద్ధతిని ప్రతి రైతు తప్పని సరిగా పాటించాలని సాగు చేయు సమయంలో విత్తన శుద్ధి చేపట్టాలన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో మందులు కొరత ఉన్నట్లు పలువురు ప్రజాప్రతినిధులు సభా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన వైద్యాధికారి మహమ్మద్ తాహ మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్రాల్లో మందుల కొరత ఉన్నమాట వాస్తవమేనని అయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మందులను అందజేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న ఇళ్లకు ఉచితంగా మీటర్లు అమర్చడం జరుగుతోందని లబ్ధిదారులు ఇంటి ఐడి నెంబరు, ఆధార్‌కార్డు తీసుకురావాలని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. తలపనూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఏపీఓ వెంకటసుబ్బయ్యను పలుమార్లు కోరినా ఆయన స్పందించడంలేదని సర్పంచు శివమారుతిరెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మండల అభివృద్ధి అధికారి సోమవారం నుంచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభారతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడి

ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

చింతకొమ్మదిన్నె: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని కమలాపురం నియోజకవర్గం ప్రత్యేక అధికారి చంద్రమోహన్ తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఇంటి నిర్మాణాలు ఎన్ని పూర్తైయ్యాయని అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, నీటి వసతి, విద్యుత్, తదితర విషయాలపై సమీక్షించారు. త్వరితగతిన పనులు చేపట్టి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగయ్య, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన కేజీ సెట్ 2కే23

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కేఎస్ఆర్ఎం, కేఎల్ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మే1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన కేజీ సెట్- 2కే23 విజయవంతంగా ముగిసిందని కేఎస్ఆర్ఎం ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరైయారన్నారు. ఈ పరీక్షా ఫలితాలను మే 30వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు. విద్యార్థులకు కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

కరువు భత్యం మంజూరుపై హర్షం

కడప ఎడ్యుకేషన్: జనవరి 2022 కరువుభత్యం 2.73 శాతంను రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్లదారులకు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన జనవరి 2022 నుంచి 2023 జూన్ వరకు ఉన్న 16 నెలల బకాయిలను ఒకే విడతలో ఆగస్టు నెలలో చెల్లించాలన్నారు. అలాగే గత డీఏల బకాయిలను కూడా వెంటనే ఉపాధ్యాయుల ఖాతాలకు జమ అయ్యేటట్లు చూడాలని కోరారు. అలాగే పీఆర్‌సీ బకాయిలను కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని వీరపునాయునిపల్లె సచివాలయ పరిధిలోని యరమలపల్లె, పోచంరెడ్డి గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్, మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోచంరెడ్డిపల్లెలో ఏపీఎండీసీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

13న లోక్ అదాలత్

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 13వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమలాపురం మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం కోర్టు పరిధికి చెందిన సివిల్, క్రిమినల్, బ్యాంక్ కేసులు ఉండి రాజీ ధోరణిలో ఉన్న వారు ఈనెల 13న జరిగే లోక్ అదాలత్‌కు హాజరై తమ కేసులను పరిష్కరించుకో వచ్చని ఆమె తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని అల్మాస్‌పేటలో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన టిప్పు సుల్తాన్ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. మత సామరస్యానికి, ఐక్యతకు ఎంతో త్యాగం చేశారన్నారు. ప్రజల సంక్షేమంలోనే నా సంక్షేమం ఇమిడి ఉందని చెప్పిన వ్యక్తి టిప్పు సుల్తాన్ అని కొనియాడారు. రాకెట్ల ప్రయోగానికి అంకురార్పణ చేసిన సృజన శీలి అన్నారు. శ్రీరంగ పట్నంలో బ్రిటిషర్లతో జరిగిన యుద్ధంలో టిప్పు సుల్తాన్ పోరాటం చేసి వీర మరణం పొందారన్నారు. ఆప్‌కీ ఆవాజ్ నాయకులు సయ్యద్ అబిద్ హుస్సేన్, ఖాదర్ బాషా, అష్రాఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్రామ వార్డు వలంటీర్లకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ వార్డు వలంటీర్లు నాలుగేళ్లుగా పని చేస్తున్నారని కనీస వేతనాలు ఇవ్వడంతో పాటు ఉగాది పురస్కారాలు ఇవ్వాలన్నారు.